


*మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు( డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.*

*(గత సంచిక తరువాయి)*

1974–75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016–17లోనూ – 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యానబర్గులో 'పీజీ టు కేజీ' గత మాసంలో ముగిసింది. ఇప్పుడు రెండవది 'బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే'. ఇందులో అంశాల్ని జరిగిన వరుస క్రమంలో కాక – పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకమూ కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

## రెండవ భాగం: బెర్లిన్ ద్వీపే డొయిచ్ ఖండే

## *చివరి విడత: మలి సందడి (33)*

### *మరో దేవుడు పిలిచాడు*

"చూడు, నేనిక్కడికొచ్చింది సైంటిఫిక్ రీసెర్చికోసం. మతం మార్చుకుందుక్కాదు" అన్నాను బింకంగా.

ఆ మాట తనకోసం కాదు. నాలో జర్మన్ ప్రీస్టుల రాక విషయమై మానసికసంఘర్షణ మొదలైందనడానికి చిహ్నమది.

నిజం చెప్పాలంటే, ఆ మాట నాకు నేనే నచ్చజెప్పుకునేందుకు చేస్తున్న ప్రయత్నంలా, నాకే అనిపించింది.

లౌకికజ్ఞానంలో శ్రీమతి ఎప్పుడూ నాకంటే అంతెత్తున ఉంటుంది. అది ఆడవాళ్లకి దేవుడిచ్చిన అపూర్వశక్తి.

ఆడవాళ్లు తాగుబోతు భర్తతో దెబ్బలు తింటూనే కాపురం చెయ్యగలరు. తిరుగుబోతు భర్తల తప్పుల్ని క్షమించగలరు. అది కూడా కాపురాలు నిలబెట్టుకుందుక్కాదు. మగాడి బలహీనతలపట్ల వారు చూపే అవగాహన, ఔదార్యం. తద్వారా ప్రయోజనం దక్కేదీ మగాడికే. ఎందుకంటే – మన వ్యవస్థలో కుటుంబవ్యవస్థ నడిచేది మగాడి పేరుమీదే!

అదే మగాడైతే – ఆడదాని విషయంలో అలాంటి అవగాహన, ఔదార్యం చూపగలడా? చూపకపోవడం వల్ల అతడు పొందే ప్రయోజనం కంటే నష్టమే ఎక్కువ. ఐనా అహానికే ప్రాధాన్యమిచ్చి దాన్ని భరిస్తాడు. అది స్వయంకృతం.

ఇప్పుడు శ్రీమతి నా మానసిక సంఘర్షణను ఇట్టే పట్టేసి, "మీరు నాకు చెబుతున్నారా? మీ మనసుకి నచ్చజెబుతున్నారా?" అంది.

నాకంటే తొమ్మిదేళ్ల చిన్నది. ఆ మాటతో నన్ను తనకంటే తొమ్మిదేళ్ల చిన్నవాణ్ణి చేసింది.

"మన పెళ్లయ్యేక నాకంటూ మనసెక్కడ మిగిలింది? నా మనసునిండా నువ్వే కాబట్టి ఆ నచ్చజెప్పడం నీకే!" అని మాట మార్చాను.

మామూలుగా అలాంటప్పుడు తను నా మాటలో భావాన్ని ఆస్వాదించి ఆనందిస్తుంది. కానీ తనప్పుడు టెన్షన్లో ఉన్నట్లుంది, ఆమె ముఖంలో రసాస్వాదనకు బదులు చిరాకు కనిపించింది, "మీకైనా, నాకైనా, మనసుకైనా సరే – నచ్చజెప్పే అలవాటు మంచిది కాదు. ఈరోజు ఇలా నచ్చజెబితే, రేపు ఏదైనా అవాంఛిత మార్పుకి సిద్ధపడినా, అందులోని

బాగోగుల గురించి ఆలోచించడానికి బదులు, ఏదో విధంగా మనసుకి నచ్చజెప్పేస్తాం. కానీ కాస్త దూరం వెళ్లి ఆలోచిస్తే.....” అని ఆగిందామె.

“దూరమంటే?” అడిగాను.

“ఇక్కణ్ణించి ఇండియా అంత దూరం. మనల్ని మనవాళ్లనుంచి వేరు చేసే మార్పు గురించి, అక్కడ మనవాళ్లకెలా నచ్చజెబుతాం. మనవాళ్లంటే ఒకరా ఇద్దరా – అటూ ఇటూ కూడా మనిద్దరివీ చాలా పెద్ద కుటుంబాలు....”

నిజంగానే తను చాలా దూరం వెళ్లింది. అప్పుడే మేం క్రైస్తవమతం స్వీకరించినట్లూ, తను ముఖానికి బొట్టు తీసేసినట్లూ, మేమంతా మెడలో శిలువలు వ్రేలాడదీసుకుని తిరుగుతుంటే, ఇండియాలో మావాళ్లంతా మమ్మల్ని చూసి అప్సెట్టయినట్లూ, వాళ్లకి మేం నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్నట్లూ – ఊహించేసుకుని కలవరపడుతోంది.

ఇంతకీ ఆ ఊహల్లోనూ తను నాకు సహధర్మచారిణే. నేను మారితే తనూ మారిపోతుంది. తను మారిపోకుండా ఉండాలంటే నన్ను మారకుండా ఆపడమొక్కటే ఆమెకున్న మార్గం. ఆపగలనా అని ఆమె బెంగ!

“నువ్వు మరీనూ, ఆలోచనల్లో మరీ దూరం వెళ్లిపోయావ్...” మందలించాను.

“వెళ్లక ఏంచేస్తాను? మీ మొహమాటం నాకు తెలియనిదా? ఇన్సూరెన్సు, రీసెర్చి పేపరు..... ఇలా ఎన్నో! కాస్త గుర్తు చేసుకోండి”

గుర్తు చేసుకుందుకేముంది – శ్రీమతి ఆ విషయాల్లో నన్ను తరచుగానే దెప్పుతూంటుంది. ఆ ఎత్తిపొడుపుకి అప్పట్లో కొంచెమైనా ముచ్చట జత పడేదేమో – ఈరోజు మాత్రం జీవన్మరణ సమస్యని ఎదుర్కొంటున్నదాన్లా మాట్లాడుతోంది.

ఇన్సూరెన్సు విషయానికొస్తే – చిన్నప్పట్నించీ ఇన్సూరెన్సు ఏజంట్ల గురించి ఎన్నో జోక్సు చదివానేమో, అదంటే నాకెప్పుడూ సదభిప్రాయం లేదు. ఆపైన ఇన్సూరెన్సు ప్రమాదాన్ని శంకిస్తుందే తప్ప నివారించదు.

కీడెంచి మేలెంచేవారికి అది ఓకే. కానీ కీడులోనూ మేలెంచే తత్వం నాది.

భువనేశ్వర్లో ఉద్యోగంలో చేరిన కొత్తలో మా ఆఫీసుకి తరచుగా లాల్జీ అనే అతను వచ్చేవాడు. కొత్తగా చేరిన మాతో స్నేహపూర్వకంగా మాట్లాడేవాడు. తొందరగానే మాకు మిత్రుడయ్యాడు. అప్పుడు తనో ఇన్సూరెన్సు ఏజెంటునన్న విషయం బయటపెట్టాడు.

మరి తను మాతో స్నేహం చేసిందే అందుకు కదా!

మేమంతా సైంటిస్టులం. లౌకికమైన ఇన్సూరెన్సులాంటివాటికి మా ఆలోచనల్లో చోటు లేదు.

“నువ్వు మిత్రుడివి కదా – నిజమైన మిత్రుడిగా మా జోలికి రాకూడదు” అనేశాడు జ్యోతిరంజన్ సాహు అనే మిత్రుడు.

లాల్జీ సామాన్యుడా, "నిజమైన మిత్రుడిగా సాయపడాలనే నేను ఇన్సూరెన్సు ఏజంటునయ్యాను" అన్నాడు. అని ఊరుకోలేదు. ఇన్సూరెన్సు వల్ల కలిగే ప్రయోజనాల్ని ఏకరువు పెట్టాడు.

దానికి నేను, "నువ్వు చెప్పిందాన్నిబట్టి, పూర్ణాయువు ఉన్నవాళ్లకి – ఇన్సూరెన్సువల్ల వెనక్కొచ్చేది కట్టిన డబ్బూ, దానిక్కాస్త వడ్డీ. అందుకు బాంకులూ, పోస్టాఫీసుల్నించి ఇంతకంటే మంచి ఆఫర్సున్నాయి. అకాలమరణం పొందినవారికే ఇన్సూరెన్సువల్ల ఏమైనా లాభం? నాకైతే నేను పూర్ణాయుష్కుణ్ణని పూర్తి నమ్మకం" అన్నాను.

అప్పుడు లాల్జీ – నాకులాగే ఆలోచించి, అనుకోని ప్రమాదానికి గురై, ప్రాణాలు పోగొట్టుకున్న నలుగురి గురించి చెప్పాడు. వాళ్లలో ఇద్దరు ఇన్సూరెన్సు చెయ్యడంవల్ల భార్యాబిడ్డలిప్పుడు సుఖజీవనం చేస్తున్నారు. ఇన్సూరెన్సు చెయ్యనివాళ్ల కుటుంబాలు రోడ్డుకెక్కాయి.

దీనికి ఠాకూర్ స్పందించాడు. అతడు పంజాబీ. మంచి హాస్యస్ఫూర్తి ఉన్నవాడే కానీ, చెప్పేది కాస్త పచ్చిగా, మోటుగా ఉంటుంది.

"నాకొచ్చే జీతం నా ఖర్చులకే చాలదు. నా మామగారు మా అవసరాలు చూస్తున్నారు. నేను పోతే నా ఖర్చు తగ్గి ఆయనకు లాభమే తప్ప, నా భార్యాబిడ్డలు రోడ్డెక్కే పరిస్థితి రాదు" అన్నాడు.

ఆ మాటతను జోక్‌గా అన్నాడే తప్ప నిజం కాదని, మాకే కాదు, లాల్జీకీ తెలుసు. అందుకని అతడు నవ్వి, "అది కాదు ఠాకూర్! అర్థాంతరంగా ప్రాణం పోతే, ఇన్సూరెన్సు లేనివాడి శవాన్ని, అయినవాళ్లే పట్టించుకోరు..." అని తనూ కాస్త మోటుగానే అన్నాడు.

"నేనంటూ లేకపోయేక నా శవాన్ని గంధపుచెక్కలతో కాలిస్తే ఏంటి? కుక్కలీడ్చుకుపోతే ఏంటి? అందులో మానావమానాలు బ్రతికున్న నావాళ్లకే కానీ నాక్కాదు"

"పోనీ నీవల్ల వచ్చిన ఇన్సూరెన్సు డబ్బుతో, నీవాళ్లు సుఖంగా ఉంటే – నీ ఆత్మకి ఎంత సంతోషంగా ఉంటుంది! అది చాలదా?"

"నేను పోతే, వయసులో ఉన్న నా భార్య జీవితకాలం ఏడుస్తూ కూర్చుంటుందా? ఏడాది తిరక్కుండా ఇంకో పెళ్లి చేసుకుంటుంది. ఆ వచ్చిన ఇన్సూరెన్సు డబ్బు – ఆ చేసుకున్నవాడు అనుభవిస్తాడు. అది చూస్తూ నా ఆత్మ కుళ్లికుళ్లి ఏడుస్తుంది? ఇదంతా అవసరమా?"

లాల్జీ కొంచెం నిరుత్సాహపడి, "ఇలా మాట్లాడినవారు నాకింతవరకూ తటస్థపడలేదు. నువ్వు ఇన్సూరెన్సు చెయ్యొద్దు కానీ, ఇలాంటి ప్రచారం మాత్రం చెయ్యకు" అన్నాడు.

ఠాకూర్ నవ్వి, "ప్రచారమంటూ చేస్తే, నా భార్యని చిన్నబుచ్చే మాటలెందుకు చెబుతాను? అసలు విషయమే చెబుతాను. అదేంటంటే, నేనేమో నెలనెలా నీకు ప్రీమియమ్ము కడతాను. చస్తే తప్ప అందువల్ల నాకేం ప్రయోజనముండదు. కానీ నువ్వు మాత్రం బ్రతికుండగానే నేనెళ్లే దారిలో పెద్ద మేడ కడతావు. అది చూసి భరించడం నావల్ల కాదు" అన్నాడు.

అందరితో పాటు లాల్జీ కూడా నవ్వాడు కానీ, "నీలాంటివాడొకడుంటే మాకు బిజినెస్ రాదు సరికదా, ఉన్నది కూడా పోతుంది" అని నావైపు తిరిగి, "మీరంతా ఉద్యోగస్థులు. నెల తిరిగేసరికి ఠంచనుగా జీతంరాళ్లు చేతిలో పడతాయి. నాకలా కాదు. మీరు కట్టే పోలసీలే జీనవాధారం. ప్రతినెలా టార్గెట్ మీటవ్వాలి. నాకోసం నువ్వొక్క పోలసీ తీసుకోలేవా రావ్!" అన్నాడు వేడుకోలుగా.

గేర్లు మార్చడమంటే ఇదే!

లాల్జీ కష్టాల్లో ఉన్నాడని నేననుకోను. మాచేత ఏదో ఒకటి చెప్పి ఎలాగో అలా ఓ పోలసీ తీసుకునేలా చెయ్యాలి. అది వ్యాపారం...

అన్నీ తెలిసినా నాకప్పుడు లాల్జీమీద తెగ జాలి పుట్టుకొచ్చింది. ఓ పోలసీ తీసుకోవాలనే అనిపించింది. కానీ...

నిజానికప్పుడు నా ఆర్థికపరిస్థితి చాలా గడ్డుగా ఉంది. నెలనెలా ఇంటికి డబ్బు పంపాలి. చెల్లెళ్ల పెళ్లిళ్లు, తమ్ముళ్ల చదువుల గురించి కొంచెం డబ్బు వేరే నిలవెయ్యాలి. వచ్చే జీతం బొటాబొటీగా ఉంటోంది.

ఐతే పేద అరుపులు నాకిష్టముండదు, "నీకు బిజినెస్ టార్గెట్లున్నట్టే నాకు సంసారంలో టార్గెట్లున్నాయి. ప్రస్తుతానికి అవి మీటవడమే కష్టంగా ఉంది. ఇప్పుడిక కొత్త ఖర్చులు తగిలించుకోలేను. ఆపైన నాకు ఇన్సూరెన్సు అవసరం లేదని గట్టి నమ్మకముంది" అన్నాను. అని ఊరుకోవచ్చుగా, అతడు నొచ్చుకోకుండా ఉండాలన్న ప్రయత్నంలో, "నాకు ప్రమోషనొస్తే కనుక తప్పక ఓ పోలసీ, అదీ చిన్నది నీనుంచే తీసుకుంటాన్లే. అది మెట్యూరయ్యేక వచ్చే డబ్బూ ఇక్కడే నీముందే తీసుకుంటాను" అన్నాను.

చాలా తెలివిగా మాట్లాడేననుకున్నాను కానీ మాట జారేనని గ్రహించలేదు.

లాల్జీ వెంటనే, "ప్రామిస్ చేశావు. తొందర్లోనే నీకు ప్రమోషన్ గ్యారంటీ. ఈ ప్రామిస్ మర్చిపోకూడదు" అన్నాడు. అతడి మొహంలో అనుకున్నది సాధించేనన్న సంతోషముంది.

అదేమిటో, ఉద్యోగంలో చేరిన నాలుగేళ్లదాకా రాదనుకున్న ప్రమోషన్, రెండేళ్లకే వచ్చేసింది.

ప్రమోషన్ ఆర్డరు ఇలా వచ్చింది, అలా లాల్జీ వచ్చి నన్ను కలుసుకుని పోలసీ గురించి గుర్తు చేశాడు.

అప్పటికింకా నా ఆర్థికపరిస్థితి మెరుగేం పడలేదు.

మాకు పాప పుట్టడం, స్వంతూళ్లో ఇంటి మరమ్మతులు — వగైరాలు అంత చెట్టుకి కొంతే గాలి అన్నట్లున్నాయి.

కానీ మాటిచ్చాను. అదీకాక, అతడి సంకల్పబలమే నాకు తొందరగా ప్రమోషనొచ్చేలా చేసిందన్న సెంటిమెంటు.

అతడు పులి అనుకుంటే నేను ఆవుని. అతడు నక్షత్రకుడైతే నేను హరిశ్చంద్రుణ్ణి.

నెలకి 40 రూపాయల పోలసీ తీసుకున్నాను. అప్పట్లో ఆ అదనపు ఖర్చు మా ప్రాణానికి చాలా ఎక్కువే.

"ఆర్థికంగా మనకంటే ఎంతో మెరుగ్గా ఉన్నవాళ్లు, పోలసీ వద్దుకాక వద్దన్నారని మీరే చెప్పారు. మాటమీద నిలబడాలన్న సెంటిమెంటుతో మాటిచ్చానని, మనకి మాత్రం అనవసరపు ఖర్చు తగిలించారు" అని వాపోయింది శ్రీమతి.

తను వాపోవడంలో అర్థముంది.

ప్రమోషనొస్తుందని తెలిసేక, ఆర్డరు చేతికొచ్చేలోగానే మేమా అదనపు ఆదాయాన్ని అంచనా వేసి కాస్త వెసులుబాటుండే బడ్జెట్ వేశాం. ఆ బడ్జెట్ రూపకల్పనలో శ్రీమతిదే ప్రముఖ పాత్ర. ఇప్పుడీ నలభై రూపాయల నెల ఖర్చునీ సద్దుబాటు చెయ్యడం కూడా తనదే బాధ్యత. అసలే తనవి చిన్న చిన్న సరదాలు. బడ్జెట్ సద్దుబాటులో వాటినే తగ్గించుకుంటుంది.

తనలో ఉత్సాహం పుట్టించాలనుకున్నాను. ఆ ఇన్సూరెన్సువల్ల ఎంత మనోస్థైర్యం వస్తుందో చెప్పాను. అందువల్ల మనసు ప్రశాంతంగా ఉండి, మా రచనావ్యాసంగం చురుగ్గా నడుస్తుందన్నాను. క్రమంగా ఈ ప్రీమియం ఖర్చుకి అలవాటు పడిపోతామన్నాను. పోలసీ మెట్యూరయ్యేక వచ్చే ఆ పాతిక ముప్పైవేలూ– ఉత్తినే చేతికి అందినట్లుంటుందన్నాను.

ఇంకా ఏదో చెప్పాలనుకున్నాను. కానీ అప్పటికే నేను నాకులా కాక లాల్జీలా మాట్లాడుతున్నాననిపించి చటుక్కున ఆపేశాను.

శ్రీమతి అదోలా చూసి, "ఇలాగైతే, ఆ లాల్జీ ప్రతి ప్రమోషనుకీ మీచేత ఓ కొత్త పోలసీ కట్టిస్తాడు. ఇదేం మొహమాటమండీ" అంది.

ఇలాంటివి చాలానే జరిగాయి. వాటిలోదే రీసెర్చి పేపరు విషయమూను...

ఉద్యోగంలో చేరిన ఏడాదికే, ఫారిన్ జర్నల్లో పబ్లికేషనుకోసం ఓ రీసెర్చి పేపరు తయారు చేశాను. అందుకు చాలావరకూ నా థీసిసు వర్కు ఉపయోగించుకున్నాను. కొన్ని అదనపు ప్రయోగాల్లో ఓ కొలీగ్ సహకారం తీసుకున్నాను. పేపరు వ్రాసేక అందులో అతడి పేరు కూడా కలిపితే, "ఇదేమో నీ థీసిస్ వర్కు. నేను నీకిచ్చింది మోరల్ సపోర్టు. పేపర్లో నా పేరు అవసరమా? అకనాలెడ్జిమెంటు చాలు కదా!" అన్నాడు. సాధారణంగా అంతా అదే చేస్తారు కానీ నేను మాత్రం నొక్కించాను.

తర్వాత ఆ పేపర్ డ్రాఫ్ట్ మా బాసుకి చూపించాను. ఆయన, "అతడికి అకనాలెడ్జిమెంటు చెబితే సరిపోయేది" అన్నాడు

నేనప్పుడు ఆ కొలీగ్ ఆ వర్కులో నాతోపాటు రాత్రింబవళ్లు ఎలా శ్రమపడ్డాడో కాస్త ఎక్కువ చేసి చెప్పాను.

బాస్ నవ్వి, "నువ్వు మాట్లాడుతున్నట్లు లేదు. పేపర్లో తన పేరెందుకుండాలో అతనే వచ్చి వాదిస్తున్నట్లుంది. ఏదేమైతేనేం, పేపరు నీది. కాబట్టి అతడి పేరుంచడం విషయమై నిర్ణయమూ నీదే! కానీ ఈ వర్కు ప్లాను, ఎగ్జిక్యూషను పూర్తిగా నీది కదా, ఫస్ట్ ఆథరుగా నీ పేరుండాలి కానీ అతడి పేరు ముందు వ్రాశావేంటి?" అన్నాడు.

రీసెర్చి పేపర్లలో ఫస్ట్ ఆథరుకుండే ప్రాధాన్యం నాకు తెలుసు. కానీ అతడి పేరు పొరపాటున ముందు వ్రాశాను. బాస్ హెచ్చరించేక అది మార్చొచ్చు కానీ, ఒకసారి వ్రాసేక మారిస్తే అతడేమనుకుంటాడో అనిపించింది. మరి మార్పు చెయ్యలేదు.

అది ఫారిన్ జర్నల్లో పబ్లిషైన నా మొదటి పేపరు.

"పేరెవరిది ముందుంటేనేంటి? అది నా పేపరే కదా! కాదనే వారెవరు?" అని శ్రీమతికి చెప్పాను.

"రీసెర్చి పేపర్ల పబ్లికేషన్లో అదో సంప్రదాయమని మీరే అన్నారు. మీకా సంప్రదాయం తెలిసినప్పుడు, దాన్ని అనుసరించాలి. ఇంత పెద్ద విషయాల్లోనూ మొహమాటానికి పోవడం, ఏదోలా మనసుకి నచ్చజెప్పడం – ఇది మంచి పద్ధతి కాదు. మీ కొలీగుకి కూడా ఇది నచ్చుబాటయిందనుకోను" అంది శ్రీమతి అప్పుడు.

అలాంటి మొహమాటంతోనే నేనిప్పుడు మతం మార్చుకుంటానేమోనని శ్రీమతి భయం.

"నువ్వు నన్ను తప్పు అంచనా వేస్తున్నావు. అన్నింటామొహమాటానికి లొంగేవాణ్ణే అయితే – నేనీపాటికి కాఫీ, టీ, సిగరెట్, విస్కీ, బ్రాందీ వగైరాలన్నింటికీ అలవాటు పడి ఉండేవాణ్ణి. వీటిలో ఏ ఒక్కటైనా కనీసం ఒక్కసారి నా పెదాల్ని తాకగలిగిందా, అది చెప్పు" అన్నాను.

"అంటే మతం కూడా అలాంటిదేనంటారా?" అంది శ్రీమతి.

"మతం అలాంటిదని ఎందుకంటాను? నేనిందాకా చెప్పినవి ప్రమాదకరమైనవి కాదు. మనిషికి ఎంతో కొంత ఉపశాంతినీ, వినోదాన్నీ, ఉత్సాహాన్నీ ఇస్తాయి. మనిషిని మనిషికి దగ్గర చేస్తాయి కూడా. మతం అలా కాదు. దానివల్ల కలిగే ఉపశాంతి, సంతోషం, ఉత్సాహం – అన్నీ మన భ్రమలే తప్ప నిజం కావు. అది మనిషిని మనిషినుంచి వేరు చేసి, ప్రపంచాన్ని ప్రళయానికి కూడా గురి చెయ్యగల ప్రమాదకరమైన వ్యవస్థ. నేనెప్పుడూ ఏ మతాన్నీ పూనుకుని స్వీకరించలేదు. ఇప్పుడూ స్వీకరించను" అన్నాను.

"మీరెన్ని చెప్పండి! నా భయం నాది. ఒకసారి రావుగారికి ఫోన్ చేద్దాం. శనివారం ప్రీస్టులతో మీటింగుకి, ఆ దంపతుల్ని కూడా ఆహ్వానిద్దాం. వాళ్లు పక్కనుంటే నాకు ధైర్యంగా ఉంటుంది" అంది శ్రీమతి.

ఆమె నిజంగా భయపడిపోతోందని నాకు అర్థమైంది.

"నువ్వు మరీ ఎక్కువ ఆలోచిస్తున్నావు. అక్కడికి మనమేదో గొప్పవాళ్లమయినట్లూ, ఆ ప్రీస్టులు మనని వాళ్లతో కలుపుకుందుకు వస్తున్నట్లూ భావిస్తున్నావు. మనమేమైనా అసాధారణ వ్యక్తులమా? అతి సామాన్యులం. మనమంటే

వారికంత ఆకర్షణెందుకు? ఏదో కుతూహలంకొద్దీ మనింటికొస్తున్నారు. తమగురించి నాలుగు మాటలు చెప్పి, మన గురించి కాసిని విశేషాలు తెలుసుకుని వెళ్లిపోతారు. రావుగారొస్తే ఇదంతా చూసి, ఉత్తపుణ్యాన మనం పడ్డ భయానికి వేళాకోళం చేస్తారు. ప్రస్తుతానికి ఎవర్నీ ఇందులో కలపొద్దు" అన్నాను.

"రావుగారు మన మనిషి. ఆయన వేళాకోళం చేసినా, నాకేం ఇబ్బందనిపించదు" అంది శ్రీమతి.

"ఐతే సరే, ఈ శనివారానికి మాత్రం వాళ్లని పిలవొద్దు. ప్రీస్టులు వస్తారు. వాళ్లు మతం మార్పిడి గురించి మాట్లాడారే అనుకుందాం. అందుకు నేను సరేనన్నానని కూడా అనుకుందాం. ఐనా వెంటనే మారిపోం కదా! అందుకు కొంత తతంగం ఉంటుంది. ఆ ఏర్పాట్లు చేసుకుందుకు వాళ్లు వెళ్లిపోతారు. అప్పుడు నువ్వు రావుగారికి ఫోను చేసి విషయం చెప్పి, ఈ వ్యవహారంనుంచి ఎలా బయటపడాలో సలహా తీసుకుందువు గాని" అన్నాను.

"అంటే రేపు శనివారంనాడు రావుగార్ని పిలవనంటారు. అంతే కదా!" అంది శ్రీమతి.

"అంతే!" అన్నాను దృఢంగా.

శ్రీమతి అయిష్టంగా మొహం పెట్టి, అసహాయతను సూచిస్తూ నిట్టూర్చింది.

మగవాడిగా, ఇంటి యజమానిగా ఓ నిర్ణయం తీసుకోవడం నాకు నచ్చదు. నా నిర్ణయంలో సగపాలు తనదీ కావాలి. అప్పుడే నాకు తృప్తి. అందుకే ఆమె నిట్టూర్పు నన్నిబ్బంది పెట్టింది.

"అంతే అన్నది నా నిర్ణయం మాత్రమే. అది నీకు నచ్చకపోతే, నువ్వు రావుగార్ని పిలవొచ్చు. అంతిమ నిర్ణయం నీదే! కానీ ఆ నిర్ణయానికి ముందు నాదో చిన్న మనవి. నా వ్యక్తిత్వంమీద నీకున్న భ్రమలు తొలగించడానికి, నాకొక్క అవకాశమివ్వు. ఇందులో నేను ఫెయిలయ్యానో, మన కుటుంబ విషయంలో మళ్లీ ఎన్నడూ స్వంత నిర్ణయం తీసుకోను. నువ్వు అవకాశమివ్వలేదూ– ఇన్నేళ్ల మన కాపురంలో నామీద ఈ మాత్రం నమ్మకం కలిగించలేకపోయిన నా అసమర్థతకి కుమిలిపోతాను" అన్నాను.

అనునయంగా అన్నాననే అనుకున్నాను. కానీ ఆ మాటలు ఆమెపై నేనాశించిన ప్రభావం చూపాయి.

"మిమ్మల్ని నమ్మకపోతే, నన్ను నేనే నమ్ముకోలేను. శనివారం సమావేశానికి రావుగార్ని పిలవొద్దు లెండి" అందామె.

మనస్ఫూర్తిగానే అన్నట్లు తోచింది నాకు.

ఐతే మేము రిలాక్సవడానికి కాసేపు పట్టింది. తర్వాత నేను, "ఆ జర్మన్ ప్రీస్టులు మన అతిథులు. వాళ్లని మనం అతిథుల్లాగే ట్రీట్ చెయ్యాలి. మనమిక ఆతిథ్యం విషయమై ప్లాన్ చెయ్యాలి" అన్నాను.

"ఇందులో ప్లాన్ చెయ్యడానికేముంది. ఏదైనా టిఫిన్ చేసి, కాఫీయో టీయో ఇద్దాం" అంది శ్రీమతి.

"ఔననుకో. కానీ ఇక్కడివాళ్లకి మన టిఫిన్లు నప్పవు. కిర్‌ష్నర్‌తో అనుభవం గుర్తుందిగా" అన్నాను.

ఉప్మాలో అల్లం ఘాటుకి తట్టుకోలేకపోయాడు కిర్ష్నర్. ఆ పరిస్థితిలో వేడి వేడి పాయసం ఇస్తే నోటబెట్టలేకపోయాడు.

జీవితంలో మర్చిపోలేని ఇబ్బందికరమైన అనుభవమది.

శ్రీమతి నవ్వి, “అదెలా మర్చిపోతాను? అందుకే చల్లపుణుకులు వేద్దామని డిసైడైపోయాను” అంది నవ్వుతూ.

పుల్లమజ్జిగలో మైదా కలిపి తగినంత అల్లం, పచ్చిమిర్చి నూరివేసేక ఆ పిండితో వేసే పుణుకుల్ని కొందరు పుల్ల పుణుకులనీ, కొందరు మజ్జిగ పుణుకులనీ అంటారు. అవి ఎంత కారంగా ఉంటే అంతిష్టం మాకు.

“అంత కారం వాళ్లు తినలేరు” అన్నాను చటుక్కున.

“కిర్ష్నర్ విషయంలో అనుభవమయ్యేక, ఆ పొరపాటు మళ్లీ చేస్తానా? వాళ్లకి కలిపే పిండిలో అల్లం, పచ్చిమిర్చి ఉండవు. కమ్మగా ఉంటుంది. ఆ పిండి వాసన, రుచి వీళ్ల పీజాకు దగ్గరగా ఉంటుంది. ఆపైన నూనెలో వేయిస్తామేమో రుచి వీళ్లకి తప్పక నచ్చుతుంది. తర్వాత వాళ్ల మూడ్ బట్టి వేడివేడిగా టీ, లేక చల్లగా కోకాకోలాయో, ఫెంటాయో ఇవ్వచ్చు” అంది శ్రీమతి.

అంత తక్కువ సమయంలో అంత దూరం ఆలోచించినందుకు ఆమెను అభినందించాను.

నాకు మాత్రం అప్పట్నించీ మనసులో – ఏదో ప్రమోషన్ ఇంటర్వ్యూకోసం ఎదురుచూస్తున్న అనుభూతి.

ఆ ఇంటర్వ్యూ అయితే తప్పనిసరి. కానీ ఇది కోరి తెచ్చుకున్నది.

విలియమ్స్ని మా ఇంటికి రమ్మంటే రానన్నాడు. అలాగే నేనూ ఆ ప్రీస్టులు మా ఇంటికొస్తానంటే వద్దనాల్సింది.

శనివారం వచ్చేదాకా, ‘అప్పుడెందుకు వద్దనలేదా’ అని నన్ను నేను నిందించుకున్న సందర్భాలు చాలానే ఉన్నాయి.

ఏమైతేనేం శనివారం రానే వచ్చింది.

ఉదయం టిఫిన్లయ్యాయి. మధ్యాహ్నం భోజనాలయ్యాయి.

చివరికి టైము మూడు అవనే అయింది. సరిగ్గా అప్పుడే మా ఇంటి కాలింగ్‌బెల్ మ్రోగింది.

ఫారిన్ పంక్చ్యువాలిటీ –

తలుపు తియ్యడానికి వెడుతుంటే నా కాళ్లు వణికాయి.

వెళ్లి తలుపు తీశాను.

ఎదురుగా వాళ్లే....

ఇద్దరు ప్రీస్టులు. తెల్లవాళ్లు. జర్మన్లు.

సన్నగా, పొడుగ్గా, తెల్లగా, తెల్లటి బట్టల్లో మెరిసిపోతూ....

ముఖంలో తేజస్సుతో, కళ్లల్లో మెరుపుతో, పెదాలపై చిరునవ్వుతో–

"నమస్తే" అని చేతులు జోడించి, కరచాలనానికి చేతులు చాపారు.

నేనూ వారికి నమస్తే చెప్పి, వారితో కరచాలనం చేసి లోపలకు ఆహ్వానించాను.

అప్పటికి నాలో బెదురు కాస్త తగ్గింది.

వాళ్లు మా ఇంటి నడవని పరిశీలనగా చూస్తూ నెమ్మదిగా లోపలకొచ్చారు.

మా రూంలో కెళ్లేక, శ్రీమతినీ పిల్లల్నీ పరిచయం చేశాను. తర్వాత మావాళ్లు అక్కణ్ణించి వంటింట్లోకి వెళ్లిపోయారు.

తర్వాత ప్రీస్టులిద్దరూ కుర్చీల్లో కూర్చుని ఇల్లంతా పరికించి చూశారు.

నేను వాళ్లకి ఎదురుగా కూర్చున్నాను.

ఇద్దర్లో ఒకాయన కాస్త పెద్దవాడిలా ఉన్నాడు. ఆయనకంటే చిన్నవాడిలా ఉన్నాయన – పెద్దాయనవంక చూశాడు.

"నువ్విక మాట్లాడొచ్చు" అన్నట్లుంది ఆ చూపు.

అప్పుడు పెద్దాయన నాతో, "మీ దేశంనుంచి ఈ దేశానికొచ్చారు. ఇక్కడ మీకెలా ఉంది?" అనడిగాడు.

"చాలా బాగుంది" అన్నాను.

నా సమాధానం ఆయనకు తృప్తిగా ఉన్నట్లు లేదు, "అంటే, ఇక్కడ మీకేమీ ఇబ్బందిగా అనిపించలేదా?" అన్నాడు.

"మా దేశంకంటే సంపన్నదేశం. మా దేశంలో కంటే సౌకర్యాలెక్కువ. ఇక్కడ ఇబ్బందేముంటుంది?" అన్నాను.

"సౌకర్యాలుండొచ్చు. కానీ అన్నీ అందుబాటులో ఉండాలి కదా!"

"అంటే?"

"మీ కారు ఫోల్క్స్ వేగన్ కావచ్చు. కానీ మెర్సిడెస్ ఐతే మరింత సౌకర్యంగా ఉంటుంది. ఇక్కడ మాకు మెర్సిడెస్ ఓ కల" అన్నాడాయన.

నేను నవ్వి, "నాకు కారే లేదు. ఆ అవసరమూ కనబడలేదు. ట్రాన్స్‌పోర్ట్ చాలా బాగుందిక్కడ" అన్నాను.

ఆయన మొహంలో ఆశ్చర్యం. "మీకు కారు లేదా? ఆ అవసరం కనబడలేదా? అంటే ఆర్థికంగా చాలా ఇబ్బందుల్లో ఉన్నారన్నమాట!" అన్నాడు చటుక్కున.

అప్పుడు నాకు భువనేశ్వర్లో నా కొలీగ్ రమేష్ చంద్ర గుప్తా గుర్తొచ్చాడు.

అక్కడ చలికి తట్టుకోలేక, చాలామంది స్వెటర్లు వేసుకుని తిరిగేవారు.

నేను భువనేశ్వర్లో ఒక్కసారి కూడా స్వెటర్ వాడలేదు. అదేమని అడిగితే, "నాకంత చలి లేదు" అన్నాను.

అప్పుడు గుప్తా పుసుక్కున, "ఇక్కడ చలి లేకపోవడమేమిటి? స్వెటర్ కొనుక్కోలేని వాళ్లు అనే మాట ఇది" అనేశాడు.

నొచ్చుకున్నాను కానీ, 'అతడి మాట తీరే అంత' అని సరిపెట్టుకున్నాను.

కానీ ఇక్కడ ఓ విదేశీయుడు కారు గురించి అలా అంటాడని నేనూహించలేదు.

ఇప్పుడూ గుప్తా విషయంలోలాగే సరిపెట్టుకుని ఊరుకోవాలా అన్నది తేల్చుకోలేకపోతున్నాను.

కానీ ఇంకా అంతకుమించిన సందిగ్ధాలు నాకోసం ఎదురుచూస్తున్నాయని నాకు తెలియదు.

***(కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments